# పశ్చాత్తాపము

శ్రీమతి డి. వి. సీతమ్మగారు

మాలతి డిప్యూటీ కలెక్టరు గారి యొక్క పుత్రిక అవటం వల్ల చిన్నప్పటినుంచీ చాలా ముద్దుగా పెరిగింది. తల్లి ఇంట్లో చిన్నపనైన చేయనీయకుండా 'నే నుంటూండగా నే నీ కెందుకమ్మా కష్టం' అని అంటూవుండేది. మాలతి చాలాచురుకైంది అయినప్పటికి తల్లిదండ్రులు ఎక్కువ గారాబంచేసి పాడుచేయుటవల్ల యే పనీ చేత కాకుండా అయిపోయింది. 15 ఏళ్లు వొచ్చేసరికి 4 వ ఫారం వరకు చదివింది చదువులోమాత్రం చురుకు చూపించేది. ఇంక బంతాట, బ్యాడ్మింటన్, సైకిల్ త్రొక్కడం, ఇవన్నీ నిత్యకృత్యాలు. సంగీతం బాగా పాడగలదు. వీణవాయించగలదు. చక్కనిదే. పొడుగ్గా సన్నంగా, పెద్దకళ్లూ, పొడుగైన నల్లటిజుట్టు చాలా అందంగావుంటుంది. అయితే గృహకృత్యాలు చేతకాకుండా పోవడం పెద్దలోటు.

మాధవరావు గొప్ప వకీలు గారికొడుకు. చక్కని వాడే. B. A. Pass అయి ఇంగ్లాండుకు బారిష్టరు పరీక్షకు వెళ్లి పరీక్షఇచ్చి సెలవలకి ఇంటికి వచ్చాడు. వాళ్లయిల్లు చాలా పెద్దది. యెప్పుడూ పదిమందికి తక్కువ కాకుండా బంధువులతోటి నిండివుంటూ వుంటుంది. మాధవుని తండ్రిగారి రాబడికూడా చాలా యెక్కువ అవడంవల్లనూ, మాధవుడు వారికి ఒక్కడే కుమారుడగుటవల్లనూ అతనికేమీ కొరతలేకుండా యున్నది. మాధవుడు ఇంగ్లాండు వెళ్లినతరువాత తన పేరు మాధవ్ గా మార్చుకొన్నాడు. అతడు చాలా బుద్ధిమంతుడు; ఎక్కువ షోకులు అవీ అట్టే లేవు. రోజూ సినీమాలు అవీ లేవు. ఇంతలో మాలతి 4 వ ఫారము పూర్తిచేసిన తర్వాత చదువు చాలించాలి సొచ్చింది. ఇంకేమీ! రోజూ బీచి షికార్లు, సినీమాలు మొదలుపెట్టింది. తల్లితండ్రులు వద్దనలేదు కూడాను. ఇలా వుంటూండగా మాధవునికి ఒకమంచి సంబంధం వచ్చింది. పిల్ల బుద్ధిమంతురాలూ, తెలుగు బాగా చదవడం వ్రాయడం వచ్చును. ఇంగ్లీషుకొంచెంవచ్చు. అందమైందనే చెప్పవచ్చును. పేరు. శశికళ. గృహకృత్యములు బాగుగా చేతనగును.

సరే వివాహం వైభవముగా జరిగినది. శశిమాధవులు అన్యోన్యంగా ఒకర్ని వొకరు వదలలేక వుంటూ ఎంతో సంతోషంగా యుంటూయుండేవారు. వారికి ఒక బాలుడుకూడా కలిగాడు. వాడికిప్పుడు 4 ఏళ్లు. పేరు రాజశేఖరుడు. అయితే మాధవ్ కిమాత్రం ఒకటి చాలా కష్టంగానుంటూయుండేది. ఏమిటంటే భార్యకు ఇంగ్లీషు తనతో మాట్లాడడానికిరాదు. అది ఒక పెద్దతప్పక్రింద తోచేది కూడాను. అయితే మాలతిని చూసినప్పటినుంచీ ఆమెను వివాహమాడ వలెనని యున్నది. మాలతికికూడా మాధవుడ్ని వివాహముచేసుకోడం ఇష్టమేనని వేరేచెప్పక్కర్లేదు. ఒకరోజున ఎంచేతనోగాని శశి తనపుట్టింటికి వెళ్లెదనని కోరింది. ఇదే సమయమనుకొని:—

"నువ్వు వెళ్లవచ్చునుకానీ మళ్లీ రానక్కరలేదు" అని అన్నాడు. పాపం శశికళ ఏమీ ఎఱుగదు గనుక అతన్ని కారణంచెప్పమని బ్రతిమాలుకుంది; కాని యతడు చెప్పలేదు. పోనీ వెళ్లను పంపించవద్దని కాళ్లమీద పడింది, కాని మాధవుడికి జాలిరాలేదు. సరికదా తత్క్షణం ఇంట్లోంచి వెళ్ళిపొమ్మన్నాడు. పాపం ఆకరుకి గుండె ధైర్యం తెచ్చుకుని పిల్లవాడ్ని నిద్రపోగొట్టి నమ్మకమైన దాదిచేతి కప్పగించి ఆ అంధకారంలో రాత్రి 12 గంటలప్పుడు వీధిలోకివెళ్లి



932

పోయింది. తర్వాత యేమయిందో తెలియదు. మాధవునికి అప్పటికికూడా కనికరం రాలేదు సరికదా పెద్ద బరువు తగ్గినట్లయింది. మర్నాడే మాలతిని వివాహం చేసుకొన్నాడు. కొన్నాళ్లు బాగా జరిగింది. తర్వాత రోజూ సినీమాలవల్లనూ పౌడరు అవీ యివీ ఒకటేమిటి అన్నిటివల్లను ఖర్చు ఎక్కువకా మొదలుపెట్టింది. ఏ సినీమాలో చూచినా, ఏ బీచిలో చూచినా మాలతీ మాధవులే. పాపం రాజశేఖరంని ఆ దాదితప్ప చూచే వాళ్లేలేరు. ఒకరోజున అయినా మాలతి పనిచేసి యెరుగదు. ఇల్లుఎలావుందో ఒక్కమారైనా పూర్తిగా చూడలేదు.

అప్పు లెక్కువఅయిపోతున్నాయికాని రాబడిలేదు. మాలతి, రాజశేఖరుని ఎప్పుడు చూచినా అసహ్యముగా చూడడమే. నిజంచెప్తే తనకుమార్త లలితకన్న శేఖరుడు చాలాఅందమయినవాడు. పాపం బట్ట అయినా లేక ఎప్పుడూ మాసినవి చింకివి కట్టుకునే వాడు. ఇప్పుడు 15 యేళ్లవాడయినాడు. కొంచెము ప్రపంచజ్ఞానం వచ్చింది. తను అధికారము చెలాయించవలసిన స్థలంలో ఒకచిన్న బాలిక లలితవున్నదని గ్రహించాడు. తనతల్లిని వెదకాలనుకున్నాడు కాని పాపం చేతిలో కానీలేదు. అయినా ఎలాగైనా వెదకాలనుకొని ఒకరోజున రాత్రి ఇంట్లోంచి వెళ్లిపోయాడు. తెల్లారింతరువాత ఇంట్లో పిల్లాడు లేకపోవడంవల్ల మాధవునికి ఏంచేతనో ఏదో లోటుక్రింద తోచింది. లలితమాత్రం వాడ్ని ఎక్కడవెతుకుతారోనని "తిని మాకోప్లేక ఎక్కడకో పారిపోయాడు ఏం 15 ఏళ్లవాడుకదా! వాడింకా వాడిప్రాణం చూసుకోలేడా" అనేది కాని మాధవుని ఆత్రత ఎక్కువవుతున్నది. పూర్వచరిత్రస్మృతికి వచ్చింది. పాపం చాలా పశ్చాత్తాపపడ్డాడు, అప్పుడు మాలతియొక్కయు శశియొక్కయు భేదం కంటికి కట్టినట్లు కనిపించింది. ఎక్కడచూచినా, శశికళా లేకపోతే తనయొక్క ఋణములు కనుబడుతున్నాయి. శశిన్నీ రాజశేఖరుడును కనబడితే తప్పకుండా తీసుకురావాలనుకున్నాడు రాజశేఖరుడు. ఒకరోజున ఆవూరికి ఒక సన్యాసిని 30 ఏళ్లదిన్నూ ఒక బాలసన్యాసి 17 ఏళ్లవాడున్నూ వచ్చారు. వారు అందరికి మంచిబోధనలు చేస్తూయుండడంవల్ల వారిసంగతి వూరంతా ప్రాకిపోయింది. మాధవునికికూడా చూడాలని బుద్ధి పుట్టింది; వారున్నచోటికి వెళ్ళాడు. కుర్రాడ్ని మాత్రం గుర్తుపట్టాడు. ఆ స్త్రీ యెవరా అని ఆలోచించాడు. ఒకవేళ తన శశికళేమో ననుకున్నాడు. ఇలా ఆలోచించుతు కూర్చుండేసరికి ఆ స్త్రీ ఉపన్యసించుట మొదలుపెట్టింది.

మాధవుని అనుమానం తీరిపోయింది.

ఇంకేముంది ఆ శశికళే! అదేరూపు అదేమాట అదే ధోరణి. ఇంక అతనికాళ్లు నిలవలేదు. గబాగబావెళ్లి శశి కాళ్లమీద పడెను. పడి తనఇంటికిరమ్మని చాలా సేపు బ్రతిమాలాడు. ఆమె పతివ్రతకాబట్టి మగనిచేత బ్రతిమాలించుకోడం ఇష్టంలేక పశ్చాత్తాపంవచ్చింది కాదా అని ఒప్పుకుంది. ముగ్గురూ ఇంటికివెళ్లారు. అంతకుముందే పశ్చాత్తాపంచేత క్రుంగిపోవుచున్న మాలతి వారికాళ్లమీదపడి, శశినిచూచి "అక్కా నాతప్పు క్షమించు. నీకొడుకుని ఇంటినుంచి పోయినట్లుచేసి తర్వాత వెదుకనీయకుండాచేసిన మహాపాపిని నేనే. నా అంత పాపాత్మురాలు ఇంక వుండదు" అని వేడుకుంది. శశికళ తక్షణం క్షమించింది. లలితనుచూచి సంతోషించింది; ఆక్షణంనుంచి ఇల్లు మహాకళగా తయారైనది. మాలతీ శశికళలు అక్కా చెల్లెళ్ళకన్న ఎక్కువప్రేమతో కాలక్షేపం చేస్తూయున్నారు. రాజశేఖరం ఇప్పుడు B. A. పరీక్షకు వెళ్లినాడు. లలితకు వివాహము అయినది. రాజశేఖరుడు తనతల్లిని వెదుకుటకు పడిన కష్టసుఖములు తెలుపుటకు ఇక్కడ ఇప్పుడు వ్రాయుటకు అవకాశములేనందున క్షమించండి. ఈ కథంతా క్షమాపణలతోటే పూర్తిఅయింది కనుక మీరుకూడ క్షమాపణతోటే నాకు సెలవు ఇవ్వండి.